షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 30 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-

# మూసీ ప్రాజెక్టుపై వెనక్కి తగ్గేదిలేదు



- నవంబర్ 1న పనులు ప్రారంభిస్తాం..
- మూసీ నది పునరుజ్జీవ పనులపై సీఎం రేవంత్ కీలక ప్రకటన
- మూసీ పునరుజ్జీవ పనులపై ప్రభుత్వం ముందుకు వెళుతుందన్న ముఖ్యమంత్రి
- సచివాలయంలో పిచ్చాపాటిగా మాట్లాడిన ముఖ్యమంత్రి
- నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ను... గేమ్ ప్లాన్ తెలుసు: రేవంత్ రెడ్డి
- మూసీ నదిని బాగుచేసేవాడు ఒకడొచ్చాడని ప్రజలకు తెలిసిందన్న రేవంత్ రెడ్డి
- 55 కిలోమీటర్ల మేర మూసీ పునరుజ్జీవం చేస్తే అద్భుత నగరమవుతుందని వ్యాఖ్య
- కేటీఆర్, హరీశ్ రావు, ఈటల అందరూ సలహాలు ఇవ్వవచ్చు అని సూచన

హైదరాబాద్

మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల విందుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఇవాళ(మంగళవారం) మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. “మాకు దీపావళి అంటే చిచ్చు బుడ్లు.. వాళ్లకు మాత్రం సారా బుడ్లు” అని విమర్శించారు. దీపావళి దావత్ అలా చేస్తారని తమకు తెలియదని ఎద్దేవా చేశారు. ఏమీ చేయకపోతే రాజ్ పాకాల ఎందుకు పారిపోయారు? అని ప్రశ్నించారు. ముందస్తు బెయిల్ ఎందుకు అడిగారని నిలదీశారు. ఇంటి దావత్‌లో క్యాసినో కాయిన్స్, విదేశీమద్యం ఎందుకని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ ఎక్స్‌పైరీ - మిగతా3లో



## ఈ దీపావళి చారిత్రాత్మకం

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఈ రోజు దేశం ధన్‌తేరస్ పండుగ, ధన్వంతరి జయంతి వేడుకలు జరుపుకుంటుంది
- పండుగ సమయంలో ప్రజలంతా తమ ఇంటికి కావాల్సిన కొత్త వస్తువులను కొనుగోలు చేస్తారు.
- దేశంలోని వ్యాపారవేత్తలకు నేను ప్రత్యేకంగా శుభాకాంక్షలు



## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలి

- నవంబర్ 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ
- సర్వే నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను కలెక్టర్లు పకడ్బందీగా పూర్తి చేయాలి
- సర్వే షెడ్యూల్ పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక,ఇంధన శాఖల మంత్రివర్యులు - మిగతా3లో



## విమానాలకు బాంబు బెదిరింపుల వెనుక మహారాష్ట్ర వ్యక్తి..!

- ఉగ్రవాదంపై పుస్తకం రాశాడట..!
- గత 13 రోజుల్లో దాదాపు 300పైగా బెదిరింపులు
- ఫేక్ బాంబు బెదిరింపుల వెనుక సదరు వ్యక్తి హస్తం ఉన్నట్లు సమాచారం.
- సదరు వ్యక్తి 2021లో ఓ కేసులో అరెస్టయ్యాడు
- ఒకే ఉగ్రవాదంపై ఒక పుస్తకాన్ని రాశాడు.



## జనాభా గణనలోనే కులగణన చేపట్టాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య
- కరోనాతో నాలుగు సంవత్సరాలు ఆలస్యంగా జరిగింది
- దేశంలోని అన్ని పార్టీలు, అన్ని కులాలు కులగణన చేయాలని డిమాండ్ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవడం శోచనీయం
- ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న కర్ణాటక, ఏపీ, తమిళనాడుతో సహా అనేక రాష్ట్రాల్లో కులగణన చేపట్టారు.
- మండల కమిషన్‌తో సహా రాష్ట్రస్థాయి 265 బీసీ కమిషన్స్ సైతం కులగణనపై సిఫారసు చేశాయి




## పోలీసులకు శుభవార్త.. ఆ నిధుల విడుదల

- పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్‌ల బడ్జెట్ రూ.182.48 కోట్ల మంజూరు
- పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్‌లకు సంబంధించిన బడ్జెట్‌ను భారీ స్థాయిలో విడుదల చేసిన రేవంత్ ప్రభుత్వం

హైదరాబాద్

తెలంగాణ పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్‌ల బడ్జెట్ రూ.182.48 కోట్లను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. పోలీస్ సిబ్బందికి సరెండర్ - మిగతా3లో

# జనవరి నుంచి సన్నబియ్యం

- ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలను వరుసగా నెరవేరుస్తున్న ప్రభుత్వం
- తాజాగా చెప్పిన గుడ్ న్యూస్, పేద ప్రజలందరికీ గొప్పవరమనే చెప్పవచ్చు
- మధ్య తరగతి, ధనిక కుటుంబాలలో కనిపించే సన్నబియ్యం ఇక పేదలకు కూడా అందనున్నాయి
- పేదలకు జనవరి నుండి రేషన్ షాపుల ద్వారా, సన్న బియ్యం సరఫరా సాగిస్తామంటూ తాజాగా ప్రకటన



హైదరాబాద్

తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సూపర్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలను వరుసగా నెరవేరుస్తున్న ప్రభుత్వం.. తాజాగా చెప్పిన గుడ్ న్యూస్, పేద ప్రజలందరికీ గొప్పవరమనే చెప్పవచ్చు.మధ్య తరగతి, ధనిక కుటుంబాలలో కనిపించే సన్నబియ్యం ఇక పేదలకు కూడా అందనున్నాయి. సూపర్ సిక్స్ పథకాల హామీతో అధికారం చేజిక్కించుకున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని అమలు పరచడంలో ఏమాత్రం - మిగతా3లో



## కెనడాలో భారత్ సహా విదేశీ విద్యార్థులకు షాక్

- ఉచితంగా ఆహారాన్ని అందించే ఫుడ్ బ్యాంకు సేవల్లో కోత
- మొదటి ఏడాది విద్యార్థులకు ఈ సౌలభ్యం కల్పించకూడదని వాంకోవర్ ఫుడ్ బ్యాంక్ నిర్ణయం
- ఇప్పటికే స్టూడెంట్ డిపాజిట్ రెట్టింపు
- తాజా నిర్ణయంతో విదేశీ విద్యార్థులకు ఇక్కట్లు

## వారంలో బహిరంగ క్షమాపణలు చెప్పండి

కేంద్ర మంత్రి బండి సంజయ్.



హైదరాబాద్

లీగల్ నోటీసులకు భయపడేది లేదు.. నా వ్యాఖ్యల్లో తప్పేలేదు.. నాకే కేటీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ రివర్స్ అటాక్ చేశారు కేంద్ర మంత్రి బండి సంజయ్. మాజీ మంత్రి కేటీఆర్ తనకు పంపిన లీగల్ నోటీసులపై బండి సంజయ్ స్పందించారు.మాజీ మంత్రి కేటీఆర్ ను ఉద్దేశించి, బండి సంజయ్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై స్పందిస్తూ.. బీఆర్ఎస్ పాలనలో ట్యాపింగ్ జరిగిందని విమర్శలు చేశారు



## దీపోత్సవానికి ముస్తాబవుతున్న అయోధ్య

- 28 లక్షల దీపాలతో ప్రపంచ రికార్డుకు సిద్ధం
- గతేడాది ఏకంగా 25 లక్షల దీపాలు ఒకేసారి వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది.
- మొత్తం 51 ఘాట్‌లలో ఒకేసారి 28 లక్షల దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు
- రామ మందిరం నిర్మాణం తర్వాత తొలి సారి జరుగుతున్న దీపావళి పండుగ కావడంతో ఈ దీపోత్సవాన్ని మరింత అద్భుతంగా నిర్వహించాలని భావన

## డాక్టర్ అభయ కేసులో సిబిఐ
# దర్యాప్తు వేగవంతం చేసి సత్వర న్యాయం చేయాలి

భారత కార్మిక సంఘాల సమాఖ్య

**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి అక్టోబర్ 29:** డాక్టర్ అభయ కేసులో సీబీఐ దర్యాప్తు పూర్తి చేసి న్యాయం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టి యు) అఖిల భారత కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ప్రైవేట్ డాక్టర్ లు సిబ్బంది ఇఫ్టూ నాయకులు కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి హంతకులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని నిరసన తెలుపుతూ అభయకు రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్ధన్ మమత హాస్పిటల్ డాక్టర్ హెచ్ సౌజన్య విజయ హాస్పటల్ డాక్టర్ సీ హెచ్ సూర్యతేజ ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు గడ్డం నాగరాజు లు మాట్లాడుతూ కోల్ కతా అర్జీకార్ ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన భయానకమైన హత్యాచార ఘటన అలాగే అయోధ్యలో పారిశుధ్య కార్మికులపై జరిగిన సామూహిక అత్యాచారం మరెన్నో ఘటనలు ఈ రెండున్నర నెలలలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక హింసపై అందరినీ మేల్కొనేలా చేశాయని ఈ ఘటనలు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. డాక్టర్ అభయ ఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వ పోలీసులు సీబీఐ అనుసరిస్తున్న తీరు పట్ల మండిపడ్డారు. మహిళా కార్మికుల ఉద్యోగుల భద్రత కై పోరాడాల్సిన




అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ కె పూజ మలి పెద్ది భాస్కర్ మమత హాస్పిటల్ సిబ్బంది పద్మ నాగలక్ష్మి కావ్య విజయ హాస్పటల్ సిబ్బంది ముద్దే పాక రాణి ఎం రాధిక పి యేసు పద్మ అభిరామ్ సీహెచ్ వంశీ డి సంజయ్ రేణుక అర్పిత నర్సింగ్ హెూం సిబ్బంది కమటం భావన గ్యార స్నేహ ఆలేటి తేజ వస్పరి కీర్తన సుప్రత భవ్య స్పందన మౌనిక ఏఐకేఎంఎస్ నాయకులు ఇక్కిరి సహదేవ్ వంగల నర్సింహారెడ్డి పీడీఎస్యు నాయకులు ఆర్ ఉదయ్ పాకాల నరేష్ ఇరుగదిండ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బిజెపి బలోపేతానికై కృషి
## ...పూజారి కుమారస్వామి గౌడ్



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి అక్టోబర్ 29 :** బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆలేరు మండలం కందిగడ్డ తండా గ్రామంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు భోగ శ్రీనివాస్ నాయకులు కేతవత్ వీరయ్య నాయక్ లకావత్ సునీత కృష్ణమూర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

## మైనర్ బాలికను వేధించిన
## ఉపాధ్యాయుడి పై పోక్సో చట్టం కేసు నమోదు



**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి అక్టోబరు 29 :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో కొత్తపల్లి 20వ వార్డుకు చెందిన నామని సత్యనారాయణ (53) ప్రభుత్వ ఉపాధ్యాయుడు సోమవారం సాయంత్రం ఐదున్నర గంటలకు తన ఇంటి పరిసర ప్రాంతంలో ఆడుకుంటున్న సుమారు పది సంవత్సరాల మైనర్ బాలికను ఇంటికి పిలిచి జామ కాయలు ఇస్తానని చెప్పి మభ్య పెట్టి ఇంటి లోపలికి వచ్చిన బాలిక ను ఇంట్లో ఎవరు లేని సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక గట్టిగా కేకలు వేసిందని బాలిక కేకలు వేయడంతో విడిచిపెట్టిన ఉపాధ్యాయుడు విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించడంతో బాలిక భయపడుతూ ఇంటికెళ్ళిందని కూలి పనికి వెళ్లిన బాలిక తల్లి సాయంత్రం 6 గంటలకు బాలిక తల్లి ఇంటికి రావడంతో బాలిక విషయం తల్లికి చెప్పిందని విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు వెంటనే స్థానిక జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పట్టణ సిఐ వరిగంటి రవి నామని సత్యనారాయణ ను విచారణ చేసి ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్ కు తరలించినట్లు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో
# ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి






సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి అక్టోబరు 29:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని, అమలు చేసేవరకు ప్రజల పక్షాన సిపిఎం శ్రేణులు ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసు దేవ రెడ్డి అన్నారు. మంగళవారం సిపిఎం జమ్మికుంట మండల మూడవ మహాసభల సందర్భంగా మోత్కుల గూడెం చౌరస్తా నుండి గాంధీ చౌక్ మీదుగా వర్తక సంఘం భవనం వరకు ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు మహా సభల సూచికగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు కొప్పుల శంకర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధుల సభ లో ముందుగా ఇటీవల మృతి చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి అమర వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ మహాసభకు బాసిర సంపత్ రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తుందని నిత్యావసర ధరలు విపరీతంగా పెంచిందని కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల పై టాక్సీలు పెంచడంతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగాయని అన్నారు. దేశభక్తి పేరుతో దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నేషనల్ మోనిటేషన్ పైప్ లైన్ పేరుతో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. 2024 ఏప్రిల్ నుండి అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్ కు 89.40 డాలర్ల నుండి 73. 59 డాలర్లకు పడిపోయిందని దాదాపు 18 శాతం మేర తగ్గింది మోడీ ప్రభుత్వ ఆదేశాల మేరకు చమురు ఉత్పత్తి కంపెనీలు దేశంలో రిటైల్ లో పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించలేదు అని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు అధిక ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేస్తుంది అని అన్నారు కూరగాయలు ఆహార ధాన్యాలు, ఇతర నిత్యావస వస్తువుల ధరలు పెరగడానికి కారణం అవుతాయన్నారు. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర క్యాబినెట్ ఇటీవల ఆమోదించిన ఒకే దేశం ఒకే ఎన్నిక భావనను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. పార్లమెంటు శాసనసభ స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి తీసుకునే చర్యలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు, సమైక్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తాయన్నారు రాష్ట్రాల శాసనసభకు ఐదేళ్ల కాలపరిమితి కల్పిస్తున్న రాజ్యాంగాన్ని ఇది ఉల్లంఘిస్తుందని అన్నారు.

రాష్ట్రాల హక్కులను నులిపేసే జమిలీ ఎన్నికలను తిరస్కరించాలని అన్నారు. ఇజ్రాయిల్ కు ఆయుధాల ఎగుమతులపై తక్షణమే నిషేధం విధించాలన్నారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు హత్యలు లైంగిక వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక రకాలుగా మహిళలు హింసకు గురవుతూనే ఉన్నారని మహిళల రక్షణ కోసం సమగ్రమైన చట్టాలు రూపొందించాలని బాధితులకు న్యాయం జరిగేంత వరకు అన్ని విధాల సహాయం అందించాలన్నారు. మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి భవిష్యత్తు ఆందోళన పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్ జోన్ కమిటీ సభ్యులు కొప్పుల శంకర్ జక్కుల రమేష్ యాదవ్ ఇల్లంతకుంట ప్రజా సంఘాల కన్వీనర్ చెలుపూరి రాములు మండల నాయకులు రావుల ఓదెలు బైరం సమ్మయ్య గడ్డం శోభన్ వడ్లూరి కిషోర్ చల్ల కుమార్ రామస్వామి క్రాంతి ఖలీల్ పాషా ప్రసాద్ పోచయ్య కిరణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## బఫర్ జోన్ లో అక్రమ
## నిర్మాణాలకు సహకరిస్తున్న ఇరిగేషన్ ఏఈ పరమేష్



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి అక్టోబరు 29:** చెరువులు నాళాల పరిధిలో నిర్మించిన కోట్ల రూపాయల విలువైన విల్లాలను ఇళ్లను ఓవైపు ప్రభుత్వం హైడ్రా పేరుతో ఓ పక్క కూలుస్తుంటే అవేమీ పట్టించుకోకుండా బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్న ఓ ఇరిగేషన్ ఏఈ పూర్తి వివరాల్లోకి వెళితే పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలకు స్వయంగా ఇరిగేషన్ ఏఈ సహకరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇరిగేషన్ ఏఈ ని ప్రసన్నం చేసుకుంటే చాలు బఫర్ జోన్, ఎఫ్టీఎల్ ఎక్కడైనా అక్రమ నిర్మాణం చేసుకోవచ్చా..? బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాల్సిన అధికారి ఏఈ అక్రమ నిర్మాణ దారులకు వత్తాసు పలుకుతూ జేబులు నింపుకుంటున్నారని విమర్శిస్తున్న స్థానిక ప్రజలు గుసగుసలు వినిపిస్తున్నాయి ఇదంతా తెలిసినా స్థానిక రెవెన్యూ అధికారులు కూడా అక్రమ నిర్మాణాన్ని ఆపకుండా అక్రమ నిర్మాణాదారులకు సహకరిస్తూ మేమేమైనా తక్కువ తిన్నామా అంటూ వారు కూడా దండిగా జేబులు నింపుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు బఫర్ జోన్ లో 9 మీటర్లు సరిహద్దులు గా నిర్ణయించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు

## క్రీడాకారుల శిక్షణ
## కొరకు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు



**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి అక్టోబరు 29:** నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ మంగళవారం పట్టణంలోని కబడ్డీ మినీ స్టేడియం లో క్రీడాకారుల శిక్షణ కొరకు ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రూల్స్, రేగ్యులేషన్స్ కమిటీ కన్వీనర్ నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్. పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ నూనెల స్ట్రీట్ ఫుడ్‌తో
# రోగాల పాలవుతున్న నేటి యువత

**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి అక్టోబరు 29**

ఈ రోజుల్లో ఎక్కడపడితే అక్కడ, ఏది పడితే అది.. లాగించేస్తున్నారు.. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఇష్టమైన స్నాక్స్ ను ఆరగించేస్తున్నారు.. అయితే.. స్ట్రీట్ ఫుడ్స్ తినడం వల్ల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని డాక్టర్ లు హెచ్చరిస్తున్నారు హైదరాబాద్ లో ఓ మహిళ తనకు ఇష్టమైన సమోసా తిని ప్రాణం పోగొట్టుకుంది. అంతకు ముందు షవర్మా తిని చాలా మంది అస్వస్థతకు గురయ్యారు.



**పానీ పూరి..**

బహుశా దీన్ని ఇష్టపడని వారు ఉండరేమో.. సాయంత్రం అయ్యిందంటే చాలు.. కొందరు పానీ పూరి బండి వద్ద క్యూ కట్టేస్తున్నారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరూ అమితంగా ఇష్టపడే పానీ పూరి.. స్ట్రీట్ ఫుడ్ లో అత్యంత ప్రమాదకరమైందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇందులో డేంజరస్ బ్యాక్టిరియా తో పాటు రసాయనాలు కూడా ఉంటాయని అంటున్నారు. అంతేకాదు పానీ పూరి లో ఉపయోగించే వడకట్టని నీరు వల్ల కలరా బారిన పడే ప్రమాదం ఉందని అంటున్నారు. కొన్నిసార్లు మసాలా నీటిలో ఉపయోగించే సింథటిక్ రంగులు కూడా మన ఆరోగ్యంపై పెను ప్రభావం చూపిస్తాయి. పానీ పూరి వల్ల గుండె జబ్బులు, ఇమ్యూనిటీ డిజార్డర్స్ వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్ లు పానీ పూరి తినే వారందరినీ హెచ్చరిస్తున్నారు

## మర్యాదపూర్వకంగా
# ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో

**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి అక్టోబరు 29:** వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నర్సంపేట కు ఆర్డీవో గా బదిలీపై వచ్చిన ఉమా రాణి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ లో ఉన్న పలు సమస్యలు అభివృద్ధి పనులకు తనవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు.



ఈ కార్యక్రమంలో నర్సంపేట తహసీల్దార్ పాల్గొన్నారు.

## సమయానికి వైద్యం అందక బాలుడు మృతి






**షణ్ముఖ వెలుగు హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబరు 29:** జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన నరేష్ -నేహా దంపతుల 11 నెలల బాబు రియాన్స్ కు తీవ్రమైన జ్వరం రాగా సోమవారం జమ్మికుంట పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బాబు తల్లిదండ్రులు హనుమకొండ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లే క్రమంలో రియాన్స్ కు తీవ్ర జ్వరంతో పాటు ఫిట్స్ రావడంతో మార్గ మధ్యంలో మరణించాడు, తీవ్ర కలత చెందిన బాలుని తల్లిదండ్రులు చేసేదేమీ లేక ఇంటికి వెళ్లి మంగళవారం ఉదయం మొదలు చికిత్స జరిపిన జమ్మికుంట లోని ప్రైవేటు దవాఖాన వైద్యుల నిర్లక్ష్యం వల్లనే తమ బాబు మరణించాడనే అభియోగం తో జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు విచారణ జరిపిన జమ్మికుంట పట్టణ సిఐ వరగంటి రవి ని విలేఖరులు వివరణ కోరగా ఇందులో ప్రైవేటు హాస్పిటల్ డాక్టర్ల నిర్లక్ష్యం ఏమి లేదని బాబుకు అతి జ్వరంతో పాటు ఫిట్స్ రావడంతో సాధారణ మరణం సంభవించిందని తల్లిదండ్రులు నిర్ధారించుకొని కేసును వాపస్ తీసుకున్నారని పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు.

## జనార్ధన్ గౌడ్ కు మోకుదెబ్బ నాయకుల నివాళులు



**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి అక్టోబరు 29:** నర్సంపేట మండలం ద్వారక పేట గ్రామానికి చెందిన సట్ల జనార్ధన్ గౌడ్ అనారోగ్యంతో మంగళవారం ఉదయం స్వర్గస్తులయ్యారు. విషయం తెలిసిన గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ కీశే జనార్ధన్ గౌడ్ పార్థీవ దేహం పై పూలమాల వేసి నివాళులు అర్పించి కీ.శే. జనార్ధన్ గౌడ్ కుటుంబ సభ్యులను రమేష్ గౌడ్ పరామర్శించారు ఈ కార్యక్రమం లో మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకన్న గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్ కౌన్సిలర్ రామ సహాయం శ్రీదేవి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు శీలం వీరన్న గౌడ్ జిల్లా కార్యదర్శి కొండి రాము గౌడ్ జిల్లా సలహాదారులు మాచర్ల ఐలుమల్లు గౌడ్ ఆర్టీసి జెఏసి నాయకులు వేముల రవి గౌడ్ గౌడ సంఘం నాయకులు బూర్గు సాంబయ్య గౌడ్ సట్ల నర్సయ్య గౌడ్ సట్ల సతీష్ గౌడ్ కుర్ర వెంకన్న గౌడ్ కుర్ర రాజు గౌడ్ కొయ్యేడి శ్రీనివాస్ గౌడ్ రామగిరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ జుట్టుకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థిని ఎ.సరయు



**ణ్ముఖ వెలుగు ముధోల్ ప్రతినిధి అక్టోబరు 29:** ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అమీర్ ఖుస్రో పిడి శ్రీనివాస్ తెలిపారు. క్రీడా సమాఖ్య నిర్మల్ ఆధ్వర్యంలో వడ్యాల్ లో ఆదివారం అండర్ 17 బాలికల కబడ్డీ జోనల్ సెలక్షన్ లలో 10 వ తరగతి కి చెందిన ఏ. సరయు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. నవంబర్ 3 వ తేదీన మహబూబ్ నగర్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

## భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ లకు సన్మానం



**షణ్ముఖ వెలుగు భైంసా ప్రతినిధి అక్టోబరు 29:** భైంసా మార్కెట్ కమిటీ నూతన చైర్మెన్ ఆనంద్ రావు పటేల్ వైస్ చైర్మన్ ఫరూక్ హైమద్ తో పాటు డైరెక్టర్లను మంగళవారం పలువురు ఘనంగా సన్మానించారు, మాజీ జడ్పిటిసి సభ్యులు సూర్య కాంత రెడ్డి మున్నూరు కాపు సంఘం నాయకులు చోండి రాజేశ్వర్ మాంజరి రాందాస్ ఆర్ఎంపీ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు మోహన్ శాలువా పూలమాలలతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు,

## జిల్లా ఆర్యవైశ్య మహాసభ సహాయ కార్యదర్శిగా మంచన మల్లేశం



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి అక్టోబర్ 29 :**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట సురేంద్రపురి సమీపంలోని వాసవీ నిత్యాన్నదాన సత్రం కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన మంచన మల్లేశం యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన సంఘం జిల్లా అధ్యక్షులు మల్లగారి శ్రీనివాస్ కు మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు ఉప్పల శారద వాసవీ నిత్యాన్నదాన సత్రం సురేంద్రపురి అధ్యక్షులు అయిత రాములు యాదాద్రి భువనగిరి జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు మార్త వెంకటేశం ఆర్యవైశ్య సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మల్లగారి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి బెజుగం సంతోష్ కుమార్ కోశాధికారి నోముల నవీన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గౌరి శెట్టి అశోక్ జిల్లా వివిధ మండలాల ప్రజా ప్రతినిధులు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొని మాట్లాడుతూ మంచన మల్లేశం కు జిల్లా కార్యవర్గంలో చోటు దక్కినందుకు గంప కృష్ణ సముద్రాల సత్యం ఉప్పలయ్య కస్తూరి వెంకటేష్ మురారి శెట్టి రాజేశ్వర్ మురారి శెట్టి వెంకటేష్ ఎర్రం భాస్కర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామీణ విద్యా వ్యవస్థను.. గాడిన పెట్టేదెలా?

**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి అక్టోబరు 29:** తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాల్లో విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టింది ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు అదే ఒరవడి కొనసాగింది. గ్రామీణ ఉపాధ్యాయుల ఎంపిక నుంచి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వరకు ఇన్చార్జి ల పాలనలతోనే మ మా అనిపించారే తప్ప ఏనాడూ విద్య అభివృద్ధిపై పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ప్రైవేటు యూనివర్సిటీలు పై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ గ్రామీణ విద్యా వ్యవస్థపై లేకపోవడమే నేటి దుస్థితికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువు కుంటున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో గత పాలక పక్షాలు విపరీత నిర్లక్ష్యం చేస్తున్నాయి ఫలితంగా గ్రామీణ నిరుపేద విద్యార్థి సామర్థ్యానికి వ్యక్తిగత ఎదుగుదల సామాజిక అభివృద్ధి అవకాశాల్లో ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులతో పోల్చినప్పుడు అందనంత దూరంలో వెనుకబడి పోతున్నాడు. పాఠశాల మౌలిక వసతులు, ఉపాధ్యాయుల లభ్యత, విద్యా నాణ్యతలో ఉన్న లోపాలను పరిష్కరించడం ద్వారా సమాజంలోని అన్నివర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిం చడం అందరికీ సమానమైన విద్యా అవకాశాలను కల్పించడంపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి.

**మౌలిక వసతులు, వనరుల లేమి :**

తెలంగాణ, భాషా పరంగా విభిన్నత కలిగిన రాష్ట్రం. గ్రామీణ ప్రాంతాల్లో తెలుగు, ఉర్దూ లేదా ఇంగ్లిష్ భాషలో బోధన సమస్యగా మారుతోంది. గ్రామీణ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు అవసరమైన పాఠ్య పుస్తకాలు బోధనా పరికరాలు సాంకేతికత వంటి అవసరమైన వనరులు లేకపోవడం అనేక గ్రామీణ పాఠశాలల్లో విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా పారిశుద్ధ్య సౌకర్యాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేవు. ఈ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లోని విద్యా వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పెట్టుబడి పెంచుతోంది కానీ, ఆర్థిక పరిమితులు అడ్డంకిగా మారుతున్నాయి.

**క్వాలిఫైడ్ టీచర్ల కొరత :**

గ్రామీణ ప్రాంతాలు తరచుగా అర్హత కలిగిన, శిక్షణ పొందిన ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా గణితం సైన్స్ ఆంగ్లంలో బోధనా నైపుణ్యం లో ఈ అంతరం విద్యార్థులకు అందించే విద్య నాణ్యతను నేరుగా ప్రభావితం చేస్తుంది. చివరికి వారి భవిష్యత్తు ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపుతుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య, అలాగే ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల మధ్య విద్యా నాణ్యతలో అసమానతలు పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యా వ్యవస్థ లోతుగా పాతుకుపోయిన లింగ అసమానతల తో పోరాడుతూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో, బాలికలు పాఠశాలకు వెళ్లడం లేదా ఉన్నత విద్యను అభ్యసించడం పై పరిమితులను ఎదుర్కొంటున్నారు. వ్యక్తిగత వృద్ధి, సాధికారత కోసం వారి అవకాశాలను పరిమితం చేస్తారు. అమ్మాయిల విద్యను ప్రోత్సహించే ప్రోగ్రాములు, రుతుక్రమ హైజీన్ నిర్వహణ కోసం సహాయపడే విధానాలు, భద్రమైన పాఠశాల వాతావరణం ఏర్పాట్లు చేయడం. ఆంగన్ వాడీల వంటి ప్రారంభ బాల్య సంరక్షణ, విద్యా కేంద్రాలను బలోపేతం చేస్తుంది.



**చదవడం కూడా రావడం లేదు :**

ఇటీవల ఏఎస్ ఈఆర్ విడుదలైన 2022 సంవత్సరానికి సంబంధించిన తాజా వార్షిక విద్యా స్థితి నివేదిక (గ్రామీణ) ప్రకారం 14-18 ఏళ్ల మధ్య వయసులో పాఠశాలల్లో చేరని విద్యార్థుల శాతం తెలంగాణలోనే అత్యధికంగా ఉంది. జాతీయ సగటు 13.2%కి వ్యతిరేకంగా, రాష్ట్రంలో 22.1% మంది పిల్లలు ఏ పాఠశాల లేదా కళాశాలలో నమోదు చేయబడలేదు. నాలుగో వంతు మంది అబ్బాయిలు లేదా 26%, 17.4% బాలికలు విద్యా వ్యవస్థకు దూరంగా ఉన్నారు. 17-18 సంవత్సరాల వయస్సు గల పిల్లల విషయానికి వస్తే ఈ సంఖ్య 40.1% వరకు పెరుగుతుంది. ఈ జనాభాలో, 68.7% మంది నెలలో 15 రోజులకు పైగా పనిలో నిమగ్నమై ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ ను తగ్గించడం తెలంగాణలో ఒక ప్రధాన సమస్యగా ఉంది. ప్రాథమిక విద్యలో చేరిక రేట్లు మెరుగుపడ్డాయి కానీ మాధ్యమిక, ఉన్నత విద్యా స్థాయిలో డ్రాపౌట్ రేట్లు, ముఖ్యంగా బాలికలు, ఆర్థికంగా వెనుకబడిన పిల్లలలో ఇంకా ఆందోళనకరంగా ఉన్నాయి. ఏఎస్ ఈఆర్ నివేదిక అంటే దేశ వ్యాప్తంగా పౌరుల నేతృత్వంలోని గృహ సర్వే జాతీయంగా 14-18 సంవత్సరాల వయస్సు గల 25% మంది ఇప్పటికీ స్టడీ 2వ స్థాయి పాఠ్యాంశాన్ని సర ళంగా చదవలేరు, తెలంగాణలో 46.25% మంది విద్యార్థులు దానిని చదవగలరు. అయితే, జాతీయ స్థాయిలో 14-18 ఏళ్ల మధ్య 43.3% మంది విద్యార్థులు అంక గణిత సమస్యలను పరిష్కరించగలిగితే, తెలంగాణలో 19.75% మంది మాత్రమే లెక్కలు చేయగలరు. ఇంగ్లీషులో వాక్యాలను చదవడంలో జాతీయ సగటు 57.3% అయితే తెలంగాణలో ఇది 43.2% మాత్రమే.

**ఈ లోపాలను పరిష్కరిస్తే.. :**

ఇది తగ్గించడం కోసం తల్లిదండ్రులను పాఠశాల నిర్వహణలో క్రమం తప్పకుండా పాల్గొనేలా చేయాలి. పాఠశాల పనితీరు పర్యవేక్షణలో వారి పాలు పంచుకోవడాన్ని ప్రోత్సహించాలి. విద్య విలువను ప్రచారం చేసే అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. ముఖ్యంగా అమ్మాయిల విద్య కోసం, అలాగే డ్రాప్ అవుట్ రేట్లను తగ్గించడం, గ్రామీణ విద్యా కమిటీలను పాఠశాల పనితీరు, సౌకర్యాలు, ఉపాధ్యాయ హాజరు వంటి అంశాలను పర్యవేక్షించే లా బలోపేతం చేయాలి. గ్రామీణ విద్యలో నిపుణత కలిగిన ఎన్‌జీఓ లతో భాగస్వామ్యాలను ఏర్పాటు చేసి వినూత్న పరిష్కారాలు, అదనపు వనరులను అందించడం సీఎస్ ఆర్ ద్వారా ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, డిజిటల్ విద్య, పరస్పరాలు వంటి ప్రణాళికలను అమలు చేయడం, విద్యా నాణ్యత, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఉపాధ్యాయ శిక్షణను మెరుగుపరచడానికి పీపీపీ మోడల్స్ ను అన్వయించడం. విద్యార్థుల ఆరోగ్య, పోషక స్థితిని పర్యవేక్షించడానికి క్రమక్రమంగా ఆరోగ్య పరీక్షలను నిర్వహించడం, పిల్లలు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకునేలా చేయడానికి పాఠశాల సిలబస్ లో హైజీన్, శుచి శుభ్రత విద్యను జోడించడం, పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కాలేని విద్యార్థులకు రేడియో, టీవీ ఛానళ్ల ద్వారా విద్య అందించడం. విద్యా వనరులతో మొబైల్ వ్యాన్లు దూర ప్రాంతాలకు చేరుకుని అదనపు విద్య అందించడం వంటి పద్ధతులను సమగ్రంగా అమలు చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ విద్యకు సంబంధించి మంచి ఫలితాలను సాధించవచ్చు.

పాఠశాల మౌలిక వసతులు ఉపాధ్యాయుల లభ్యత విద్యా నాణ్యతలో ఉన్న లోపాలను పరిష్కరించడం ద్వారా సమాజంలోని అన్నివర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం అందరికీ సమానమైన విద్యా అవకాశాలను కల్పించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.

## ఇన్సూరెన్స్ చెక్కును అందజేసిన ఎస్ బి ఐ మేనేజర్



**షణ్ముఖ వెలుగు బాసర ప్రతినిధి అక్టోబర్ 29:** నిర్మల్ జిల్లా బాసర గ్రామానికి చెందిన మేకల నాగరాజు గత కొన్ని రోజులుగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఎన్ ఎం ఆర్ గా విధులు నిర్వహించిన మేకల నాగరాజు అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. దీంతో ఆయన కూతురు మేకల నవ్య శ్రీ నామిని గా ఉండడంతో ఎస్ బి ఐ బాసర బ్రాంచ్ లో ప్రధానమంత్రి జీవన జ్యోతి ఇన్సూరెన్స్ ఉండడంతో రెండు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఇన్సూరెన్స్ చెక్కును బ్యాంక్ మేనేజర్ అశోక్ కుమార్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రతి ఒక్కరూ జీవన జ్యోతి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ప్రత్యేకంగా అమ్మవారి ఆలయంలో తాత్కాలికంగా ఉద్యోగం నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్ సిబ్బంది ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకుంటే దీనివల్ల కుటుంబ సభ్యులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వీరి వెంట బ్యాక్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజా ప్రభుత్వం చేయూత







**ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

**ఐదున్నర కోట్లు వడ్డీ లేని రుణం పంపిణీ**

**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి అక్టోబరు 29:** మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజా ప్రభుత్వం మహిళలకు వడ్డి లేని రుణాలు అందించి చేయూతనిస్తుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పంపిణి చేశారు. నర్సంపేట కెనరా బ్యాంక్ వారి ఆధ్వర్యంలో నర్సంపేట మండలంలోని 11 గ్రామాలకు గాను 55 గ్రూపులకు ఐదున్నర కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ రుణాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గత ప్రభుత్వం మహిళలకు వడ్డి లేని రుణాలను నిలిపివేసిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు వడ్డి లేని రుణాలు కార్యక్రమం పునః ప్రారంభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల సహకారంతో తీసుకునే వడ్డీ లేని రుణాలను పూర్తిస్థాయిలో సద్వినియోగపరుచుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. గ్రామాలలో ఇంటి పరిసరాలలో కూరగాయల చెట్లు పెట్టడం కోళ్లు మేకలు పెంపకం, పాల ఉత్పత్తులు చేయడం ద్వారా గ్రామాలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఇన్సూరెన్స్ పాలసీలు చేసుకోవాలని సంవత్సర కాలం పాటు చేసిన కష్టంతో వచ్చిన డబ్బు ఒక్కరోజు అనారోగ్యంతో పోతుందన్నారు. అందువల్ల ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరికి సంవత్సరానికి 20 రూపాయలతో ఆరోగ్యాన్ని రక్షించుకోవడం కోసం హెల్త్ పాలసీలు తీసుకోవడం ద్వారా కుటుంబంలో ఆర్థికంగా చితికి పోకుండా ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అడిషనల్ డైరెక్టర్,ఎంపీడీవో, మండల సమైక్య అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## బీసీ రాజ్యాధికార సమితి
# మహబూబాబాద్ టౌన్ కమిటీల ఏర్పాటు

**షణ్ముఖ వెలుగు మరిపెడ ప్రతినిధి అక్టోబరు 29:** బిసి రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీలు ఓటు వేసి యంత్రాలు కాదు ప్రజా పాలనలో భాగస్వామ్యం కావాలని,రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈడబ్ల్యూస్ రద్దుచేయాలని అధికార ప్రతినిధి కట్ల కృష్ణ మాట్లాడుతూ రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని కోరారు. బీసీ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు వేముల వెంకన్న మాట్లాడుతూ బీసీలు అందరూ కలిసి పోరాడితే రాజ్యాధికారం మనదే అని అన్నారు జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు 50% రిజర్వేషన్ కల్పించాలని కోరారు జంపాల గోపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తాను పదవికి న్యాయం చేస్తానని బిసి రాజ్యాధికార సమితికి సైనికుడిగా పనిచేస్తానని ప్రమాణం చేశాడు. మహబూబాబాద్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొడుపు గంటి శ్రీధర్ రజక మాట్లాడుతూ మహబూబాబాద్ టౌన్ లో ఉన్న అన్ని బీసీ కులాలను ఐక్యం చేసి బిసి రాజ్యాధికార సమితిలో తన వంతు



బాధ్యత పోషిస్తానని తెలియజేశాడు. మరిపెడ మండల అధ్యక్షుడు సామకూరి కృష్ణ మాట్లాడుతూ బీసీ కులాలన్నీ ఏకమై రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో ఎక్కువ భాగం బీసీలే రాజ్యాధికారం చేయాలని కోరారు. మరిపెడ టౌన్ అధ్యక్షుడు అలువాల ఉమేష్ చందర్ మాట్లాడుతూ బీసీలు అంత కలిసి ఒక తాటి పైకి రావాలని అందరం కలిసి ఐకమత్యంగా ముందుకు వెళ్ళాలని రానున్నది బీసీ రాజ్యమే అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో గౌరవ అధ్యక్షులు గంధసిరి వేణు వేము నూరి శ్రావణ్ ,యువజన నాయకులు చిత్తారి సోమన్న, యాదవ సంఘం నాయకులు దూది మెట్ల మోహన్ రావు నరేష్ జంపాల దుర్గేశ్ మధు నాయి బ్రాహ్మణ రామరబోయిన వీరన్న, నిదిగొండ మధు కుమ్మరి కుంట నాగన్న, గీస గాని రంజిత్ గౌడ్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు..

## ఎమ్మెల్సీ ఓటు నమోదును
# ముమ్మరంగా చేయాలి




**షణ్ముఖ వెలుగు ముధోల్ ప్రతినిధి 29:** అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయు లు ఎమ్మెల్సీ ఓటు హక్కును ముమ్మరంగా నమోదు చేసుకోవాలని ముధోల్ తహశీల్దార్ శ్రీకాంత్ అన్నారు. ముధోల్ లోని తహశీల్దార్ కార్యాలయంలో పిఆర్ టి యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు ఫారాలను తహసీల్దార్ అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఓటు నమోదు కోసం ఫారం నెంబరు 18 నింపి,సంబంధిత ధ్రువ పత్రాలను జతపరిచి కార్యాల యంలో అందజే యాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమం పిఆర్ టి యూ జనరల్ సెక్రటరీ ఎం ఏ ఆహాద్,జిల్లా వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు నరసయ్య ఉపాధ్యాయులు సంజు అప్ప తదితరులున్నారు

# ఢిల్లీలో కాస్త మెరుగుపడిన గాలి నాణ్యత..
## అయినా ప్రమాదకరంగానే ఏక్యూఐ

దేశరాజధాని ఢిల్లీలో వరుసగా ఆరు రోజుల తర్వాత మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ కాస్త మెరుగుపడింది. అయినప్పటికీ ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. మంగళవారం ఉదయం 9 గంటలకు దేశరాజధాని ఢిల్లీలో ఏక్యూఐ 272గా నమోదైంది. అత్యధికంగా ముండకా ప్రాంతంలో ఏక్యూఐ 327 తో అధ్వాన స్థితికి చేరినట్లు తెలిపింది. ఇక ఆనంద్ విహార్‌లో 318, అయా నగర్‌లో 313, వజీర్‌పూర్‌లో 307, పట్‌పర్ గంజ్‌లో 296, ఆర్కేపురంలో 295, రోహిణి ప్రాంతంలో 287, ఓఖ్లాఫేజ్ %-% 2 లో 265, ఐటీవో ప్రాంతంలో 261, లోధీ రోడ్డులో 255, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో 247, అరబిందో మార్గ్‌లో 240గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక 200-300 మధ్య ఉంటే



గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు. కాగా, ఈ మధ్య ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకరంగా మారుతున్న విషయం తెలిసిందే. గత వారం రోజుల నుంచిదేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.

## నిర్మల్ జిల్లా గ్రంథాలయ
# చైర్మన్ అంజుమ్ అలీ కి సన్మానం



**షణ్ముఖ వెలుగు నిర్మల్ ప్రతినిధి అక్టోబరు 29:** నిర్మల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా నూతనంగా నియమింపబడ్డ అంజుమ్ అలీని మంగళవారం పలువురు ఘనంగా శాలువా పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు హైమద్, దేవేందర్ అల్మాస్ విజయ్ తదితరులు పాల్గొన్నారు,

## ఆలయానికి విరాళం ఇచ్చిన
## ఆంధ్ర భక్తుడు విజయ సరస్వతీ దాసు..

**అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అని నిరూపించుకుంటున్నాడు అమ్మవారి భక్తుడు**






**షణ్ముఖ వెలుగు బాసర ప్రతినిధి అక్టోబర్ 29 :** నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి కి ఓ భక్తుడు మొక్కు రూపంలో 11 లక్షల రూపాయల ఎస్ బి ఐ చెక్కును దేవస్థానం కార్య నిర్వాణాధికారి విజయ రామారావు కు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి కి చెందిన ప్రముఖ దాత శ్రీ విజయ సరస్వతీ దాసు కుటుంబంతో సహా వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారి అనుగ్రహంతో విద్యా,వ్యాపారం, ఆయువు ఆరోగ్యం అన్ని కలిసి వస్తున్నాయని భక్తుడు తెలిపారు. విజయ సరస్వతి దాసు గత కొన్ని సంవత్సరాల నుంచి ఏదో రూపకం గా వస్తురూపేనా ధన రూపేణా గతంలో బంగారం వెండి ఇతర వస్తువులు ఇచ్చే వారని, అదే విధంగా వసంత పంచమి పండగ రోజు సమయంలో ఆలయానికి పూల అలంకరణ లాంటివి చేయిస్తూ అమ్మ వారికి మొక్కులు సమర్పించుకునే వారన్నారు ఆలయ ఈవో విజయరామారావు. చెక్కును ఎస్ బి ఐ బ్యాంకులో జమ చేసినట్లు తెలిపారు.

## నమస్తే తెలంగాణ సూరంపల్లి శ్రీనివాసా చారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన విలేఖరులు

**అనారోగ్యానికి గురైన జర్నలిస్టుకు అండగా టీయూడబ్ల్యూజే ఐజేయు యూనియన్ నాయకులు**



**షణ్ముఖ వెలుగు వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబరు 29:** వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రానికి చెందిన నమస్తే తెలంగాణ జర్నలిస్టు సూరంపల్లి శ్రీనివాసాచారి లివర్ కు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఇటీవల హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని డిశ్చార్జి అయి ఇంటికి రావడంతో తీవ్ర అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో శ్రీనివాసులు కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పి టియుడబ్ల్యూజే ఐజేయు అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు 50 వేలు రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కొండన్న యాదవ్ టియుడబ్ల్యూజే ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఉమ్మడి జిల్లా ఆంధ్రజ్యోతి బ్యూరో ఇంచార్జి రవీందర్ రెడ్డి,స్టేట్ కౌన్సిల్ సభ్యులు సాక్షి జిల్లా ఇన్చార్జి బోలె మోని రమేష్,మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యులు పోలిశెట్టి బాలకృష్ణ,కొంతం ప్రశాంత్,సీనియర్ జర్నలిస్టు శ్యాం సుందర్ రెడ్డి,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నవీన్ గౌడ్ సీనియర్ జర్నలిస్టు వెంకట్ గౌడ్,జర్నలిస్టులు గోపాలకృష్ణ,పురుషోత్తం యాదవ్, రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 18,500 కోట్ల విద్యుత్తు భారాన్ని ఆపడంలో విజయం సాధించిన బిఆర్ ఎస్ నాయకుల సంబరాలు



**షణ్ముఖ వెలుగు తుంగతుర్తి ప్రతినిధి అక్టోబరు 29:** నయవంచక దగాకోరు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల పైన వేయాలనుకున్న 18,500 విద్యుత్తు చార్జీల భారాన్ని ఆపిన సందర్భంగా ప్రజల తరఫున సంబరాలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు ఇచ్చిన పిలుపు మేరకు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఆదేశాలతో తుంగతుర్తి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, మాజీ ఎంపీటీసీ నరేష్, గోపగాని శ్రీనివాస్ ,మల్లేష్ ,ఉప్పుల నాగమల్లు బొజ్జ సాయికిరణ్, ఏగురి కిరణ్, కొండగడుపుల వెంకటేష్, లతీఫ్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ముధోల్ ఖజానా చెరువు లో కనువిందు చేస్తున్న తామర పువ్వులు



**షణ్ముఖ వెలుగు ముధోల్ ప్రతినిధి 29:** ముధోల్ మండల కేంద్రలోని తానూర్ బైపాస్ రోడ్ వద్ద ఉన్న ఖజానా చెరువు తామర పువ్వులతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది ఈ ఏడాది కురిసిన వర్షాలకు ఖజానా చెరువు నీటితో పూర్తిగా నిండిపోయి చెరువు నీటి మట్టమంతా తామర పువ్వులతో పువ్వుల తోటలా కనిపిస్తు కనువిందు చేస్తున్నాయి. ఆ రహదారి గుండా వైపు వెళ్లే చూపరులను ఎంతగానో ఆకట్టు కుంటున్నాయి


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com